ఒత్తిడి జయిస్తే విజయం తథ్యం

- టెన్త్, ఇంటర్ విద్యార్థులు ప్రణాళికతో చదవాలి
- సమతులాహారం తీసుకోవాలి
- యోగా, ధ్యానం చేయాలి
- స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉండాలి
- మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి టెన్త్ పరీక్షలు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ఐరాల: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. శోధించాలన్న తపనతో సాధన చేస్తే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చు. విద్యార్థులకు పరీక్షల కాలం వచ్చేసింది. మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. అయితే ఉన్న కొద్ది పాటి సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రణాళికతో చదివితే ఎక్కువ మార్కులు సాధించవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో ఇష్టంతో చదవాలని విద్యార్థులకు సూచిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో, కాణిపాకం హైస్కూల్ ప్లస్‌కు చెందిన 300 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో 420 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కానీ పరీక్షలంటే భయం వీడాలని, ఒత్తిడి జయించి ప్రణాళికతో చదివితే విజయం సొంతమవుతుందని నిపుణులు చెబుతున్నారు. టెన్షన్ పడితే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్, బయట ఆహార పదార్థాలు తీసుకోకూడదు. పండ్ల రసాలు, కొబ్బరి నీరు, డ్రై ఫ్రూట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు పాలు తాగాలి. ప్రతి రోజు యోగా, ధ్యానం చేయాలి. దీనివల్ల చదువుపై ఏకాగ్రత వస్తుంది. రోజుకు కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. 15 నుంచి 20 నిమిషాల శారీరక వ్యాయామం చేయాలి. విద్యార్థులు మంచి ఆహారం, విశ్రాంతి తీసుకునేలా తల్లిదండ్రులు చూడాలి. ఇతర విద్యార్థులతో పోల్చకూడదు. ఎక్కువ సమయం చదవాలని ఒత్తిడి చేయరాదు. పిల్లలతో ప్రేమను పంచుతూ, స్నేహంగా మెలగాలి. ఉపాధ్యాయులను సంప్రదిస్తూ సలహాలు తీసుకోవాలి.

నిపుణుల సూచనలివీ

పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే చదివిన పాఠ్యాంశాలను కనీసం మూడు రివిజన్లకు సిద్ధపడాలి. ఏ సబ్జెక్టు ఎంత సేపు చదవాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వేకువజామున 4 గంటల సమయంలో చదివితే బాగా గుర్తుంటుంది. చదివేటప్పుడు ప్రతి గంటకు 10 నిమిషాలు విరామం తీసుకోవాలి. ఒకే రోజు నాలుగైదు సబ్జెక్టులు చదవకూడదు. ఏకాగ్రతకు భంగం కలిగించేవాటిని దగ్గరకు రానివ్వకూడదు. ఇతరులతో పోల్చుకుంటూ నిరాశ చెందకూడదు. పరీక్ష ప్రారంభానికి ముందుగానే చేరుకోవాలి.

రివిజన్ కీలకం



విద్యార్థులు పరీక్షల సమయంలో తాము నేర్చుకోని ప్రశ్నలపై ఎక్కువగా దృష్టిపెట్టి, వచ్చిన వాటిపై కాస్త నిర్లక్ష్యం వహిస్తారు. అయితే ఎంతో బాగా నేర్చుకున్న సమాధానాలైనా కొన్ని రోజులకు మర్చిపోయే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులు నేర్చుకున్న అంశాలను కూడా తరచూ రివిజన్ చేస్తుండాలి. అన్ని పాఠశాలల్లో టెన్త్ సిలబస్ పూర్తయ్యింది.

– రుషేంద్రబాబు, ఏంఈఓ, ఐరాల

సమయమే ముఖ్యం



సమయాన్ని ఎంత తెలివిగా వినియోగించుకున్నామనే అంశంపైనే సాధించే మార్కుల శాతం ఆధారపడి ఉంటుంది. సబ్జెక్టు ప్రాధాన్యతలను గుర్తించి ఉన్న కొద్దిపాటి సమయాన్ని విభజించి కేటాయించుకోవాలి. పరీక్షలు దగ్గర పడే కొద్దీ చాలామంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అప్పుడప్పుడు స్వల్ప విరామం ఇవ్వడం మంచిది.

– రెడ్డిరామరాజు, ప్రిన్సిపల్, ఐరాల

చేతిరాతపై దృష్టి పెట్టాలి



మార్కులకు దోహదం చేసే చక్కటి చేతిరాతపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలి. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ రివిజన్ పదేపదే చేస్తుండాలి. వెనుకబడిన సబ్జెక్టులపై ఎక్కువ దృష్టి సారించాలి. ఒత్తిడితో కాకుండా ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించాలి. ఉపాధ్యాయుల సూచనలు ఆచరించాలి. టీవీ, స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉండాలి.

– కోమల, హెచ్ఎం, ఐరాల

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి



ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. పరీక్షల ముందు శారీరకంగా, మానసికంగా అలసిపోతారు. ఆరోగ్యంగా ఉంటేనే పరీక్షల్ని సమర్థంగా ఎదుర్కోగలం. పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలి. తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు తినాలి. మానసికంగా ప్రశాంతంగా ఉండడం అలవాటు చేసుకోవాలి.

– ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడొద్దు

చిత్తూరు కార్పొరేషన్: గ్రూప్–2 మెయిన్స్ పరీక్షల విషయంలో అభ్యర్థులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికైనా వారితో చర్చించి వారు లేవనెత్తిన రోస్టర్ సమస్యను పరిష్కరించాలన్నారు. గత కొద్ది రోజులుగా గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసి రోస్టర్ పాయింట్స్‌లో జరిగిన లోటుపాట్లను సరిదిద్దాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. పరీక్షలు వాయిదా వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు లీకులు వదిలి నిరుద్యోగులను భ్రమల్లో పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం దుర్మార్గమన్నారు.

వరసిద్ధునికి రూ.4.5 లక్షల విరాళం



విరాళం ఇస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అన్నదాన ట్రస్టుకు, గో సంరక్షణ ట్రస్టుకు ఓ దాత ఆదివారం రూ.4.50 లక్షల నగదు విరాళం అందించారు. నెల్లూరు జిల్లాకు చెందిన దాత శ్రీనివాసులురెడ్డి అన్నదాన ట్రస్టుకి రూ.2.50 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకి రూ.2 లక్షల నగదును విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీరభద్ర ఆలయంలో మైలారు పండుగ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గంగినేని చెరువు వద్ద వెలసిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం మైలారు పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంత్ గాడ్గే బాబా జయంతి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో ఆదివారం సంత్ గాడ్గే బాబా జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీసీ సంఘం నాయకులు గాడ్గే చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు షణ్ముగం, నాయకులు రవిరాజు, వెంకటేష్, ప్రతాప్, హరి, రుద్రయ్య, సాయిరాం ఆచారి, ఈశ్వర్, హరిప్రసాద్, సూరిబాబు, సంతోష్ పాల్గొన్నారు.

మొగిలికి ఆరు ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బంగారుపాళ్యం మొగిలిలో వెలసిన శ్రీ మొగిలీశ్వరస్వామి ఆలయానికి ఆరు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని డీఎం క్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో ఈ సర్వీసులు ఉంటాయని, ప్రతి అరగంటకు చిత్తూరు నుంచి బస్సు ఉంటుందన్నారు. భక్తుల రద్దీని బట్టి మరిన్ని బస్సులను పెంచేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు



చిత్తూరు రూరల్(కాణిపాకం): కుంభాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీకుళందీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శాస్త్రీయ నృత్య ప్రదర్శనలను నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. భరతనాట్యం, కూచిపూడి, భక్తిగీతాలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చి ఆహుతులను అలరించారు. ఈ ప్రదర్శనలో తుమ్మిందకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బహుమతులు అందుకున్నారు.

మార్చి 6న దుకాణాల బహిరంగ వేలం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాముని గుడి వీధిలోని వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయానికి సంబంధించిన దుకాణాలకు మార్చి 6 తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు తెలిపారు. పొన్నియమ్మ గుడి వీధి, రాముల గుడి వీధి, పిల్లారి గుడి వీధి, సంతపేట ప్రాంతాల్లో ఒకటి చొప్పున షాపులు ఉన్నాయన్నారు. దుకాణాల వేలం మార్చి 6న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. ఆసక్తి గలవారు ముందస్తుగా డిపాజిట్లు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు

కంటి చూపును కాపాడుకుందాం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): కంటి చూపును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ నేపథ్యంలోనే ఉచిత కంటి వైద్య సేవను నిర్వర్తిస్తున్నామని జైన్‌సంఘ నిర్వాహకులు సుభాష్‌జైన్ పేర్కొన్నారు. చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్‌వి అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులతో శిబిరం నిర్వహించగా, 161 మంది కంటి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 68 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్‌తోపాటు వసతులు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, విశాల్, ప్రవీణ్, లలిత్, జ్యోతి, ఎవంత్, కమలేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడు క్రాస్‌లోని గ్రానైట్ ఫ్యాక్టరీలో యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. బీఎన్ఆర్ పేట పోలీసుల కథనం మేరకు బిహార్‌కు చెందిన పవన్ కల్యాణ్ (21) రెండేళ్ల క్రితం పని నిమిత్తం గ్రానైట్ ఫ్యాక్టరీకి వచ్చాడు. శనివారం రాత్రి నైట్ డ్యూటీ చేసిన ఆ యువకుడు ఫ్యాక్టరీ ఆవరణలో మోటార్ గదిలో కునుకు తీశాడు. సాయంత్రం అక్కడ పనిచేసే కొందరు తలుపు తెరిచే సరికి వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. మృతదేహాన్ని చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇంటర్ విదార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న చిట్టిబాబు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, అధ్యాపకులు చిట్టిబాబు ఆదివారం విద్యాసామగ్రి వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ ప్రణాళిక ప్రకారం సన్నద్ధం కావాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలంటే భయపడకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని చెప్పారు. అనంతరం 250 మంది విద్యార్థులకు తన సొంత నిధులతో ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర సామగ్రి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో సాహిత్యం కీలకం



కవులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): సాహిత్యానికి ఎల్లలు లేవని, ఉత్తమ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర విస్మరించలేమని ప్రముఖ సాహితీవేత్త రాధేయ అన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం గంటా కమలమ్మ సాహితీ పురస్కారాన్ని అందజేశారు. తుల శ్రీనివాస్, సాంబమూర్తి సంయుక్తంగా, నిర్వాహకులు గంటా మోహన్ ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. రాధేయ మాట్లాడుతూ, తెలుగు భాషను, సాహిత్యాన్ని పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత సాహితీవేత్తలపై ఉందన్నారు. ప్రతిష్ఠాత్మక గంటా కమలమ్మ స్మారక పురస్కారాన్ని తెలంగాణ కవి తుల శ్రీనివాస్, ఉత్తరాంధ్ర యువ కవి సాంబమూర్తి అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ప్రముఖ వైద్యురాలు, సాహితీ వేత్త డాక్టర్ రామలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రుల స్మారకార్థం సాహితీ పురస్కారాన్ని అందజేయడం ఆరోగ్యకరమైన సంప్రదాయమని అభినందించారు. అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాకం నాగరాజా మాట్లాడుతూ నేటితరం పుస్తక పఠనం వైపు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పలువురిని జ్ఞాపిక, నగదు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. సాహితీ ప్రముఖులు పలమనేరు బాలాజీ, పల్లిపట్టు నాగరాజు, గిరిధరన్, మేఘనాథ్ రెడ్డి, తులసీనాథం నాయుడు, యువ శ్రీ మురళి, హరి నాయుడు, గల్లా మాధవీలత, రాజారత్నం రెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

జోరుగా బియ్యం అక్రమ రవాణా



బైక్ ద్వారా అక్రమంగా తరలిస్తున్న బియ్యం

గుడిపాల: మండలం మీదుగా బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఆంధ్ర నుంచి తమిళనాడుకు పచ్చిబియ్యం అక్రమ రవాణా చేయగా తమిళనాడు నుంచి ఆంధ్రకు ఉప్పుడు బియ్యం రవాణా చేస్తున్నారు. కొంతమంది స్మగ్లర్లు ప్రతి రోజూ యథేచ్ఛగా ఈ అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. గతంలో ఆటోలు, మినీవ్యాన్‌లు, టాటా ఏస్ వాహనాల్లో తీసుకెళ్లి వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయడంతో ద్విచక్ర వాహనాల ద్వారా వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్‌షాపుల ద్వారా బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేస్తారు. కొంతమంది కార్డుదారుల వద్దకు వెళ్లి కిలో బియ్యాన్ని రూ.12కు తీసుకొని ఇదే బియ్యాన్ని తమిళనాడులోకి తీసుకెళ్లి రూ.20కి విక్రయిస్తున్నారు. మరికొంత మంది తమిళనాడులో ఉప్పుడు బియ్యాన్ని కిలో రూ.10కి తీసుకువచ్చి ఇక్కడ రూ.20కి విక్రయిస్తున్నారు. ప్రతి రోజు మండలం మీదుగా ఈ తంతు ముమ్మరంగా సాగుతోంది. తమిళనాడు నుంచి ద్విచక్ర వాహనాల ద్వారా బియ్యాన్ని తీసుకువచ్చి చిత్తూరు కేంద్రంగా విక్రయాలు సాగిస్తున్నారు. కానీ వీటిపై అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

రథోత్సవం.. నేత్రపర్వం!



రథంపై ఊరేగుతున్న స్వామి వారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహాశివరాత్రిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీ చిదంబరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం రథోత్సవాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, శివపార్వతులను ఆశీనులు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి రథాన్ని ముందుకు కదిలించారు. భక్తుల చేతుల మీదుగా రథం నగర వీధుల్లో ముందుకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.



రథం లాగుతున్న భక్తులు

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

ఐరాల: బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 24, 25 తేదీల్లో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధనలక్ష్మి తెలిపారు. ఎంపీడీఓ, బ్యాంక్ మేనేజర్లు సంయుక్తంగా ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేస్తామని చెప్పారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ అప్లికేషన్, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

పుస్తక పఠనంతో సత్ప్రవర్తన



పుస్తకాల ప్రదర్శనలో కొనుగోలుదారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పుస్తక పఠనం సత్ప్రవర్తన నేర్పుతుందని అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు గంటమోహన్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని పీసీఆర్ సర్కిల్‌లో ఆదివారం ఆయన సగం ధరలకే పుస్తకాలు విక్రయిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు పుస్తక పఠన ప్రియుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఉదయం నుంచి గంట పాటు పుస్తక ప్రియులతో ఆ ప్రాంతం కాస్త సందడిగా కనిపించింది. పుస్తక పఠనం ద్వారా లభించే జ్ఞానం జీవితాంతం వెంట ఉండి వారి భావిజీవితం తేజోవంతం చేస్తుందన్నారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమ వారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య బృందం వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మెంటార్షిప్ శిక్షణ శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో కాలేజీలో ఆదివారం మెంటార్షిప్ శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. దీనికి అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. డాక్టర్ విష్ణు ప్రియ మాట్లాడుతూ అధ్యాపకులు మెంటార్షిప్ జ్ఞానం, అవగాహనను అంచనా వేయడానికి కొన్ని వ్యాయామాలు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కోదండన్, సుధా పాల్గొన్నారు.

సీఎంసీలో మాస్టర్ హెల్త్ చెకప్



గుడిపాల: మండలంలోని చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రిలో మాస్టర్ చెకప్ సేవలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారు మాట్లాడుతూ చిత్తూరు సీఎంసీ ఆస్పత్రి క్యాంపస్‌లో ప్రత్యేకంగా మాస్టర్ హెల్త్‌చెకప్ ప్రారంభించినట్లు వివరించారు. ఒకేరోజులో అన్ని పరీక్షలు చేసి పంపిస్తామని వెల్లడించారు. ప్రతిరోజు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఉదయం 7:30 గంటలకు ఏమి తినకుండా ఆస్పత్రికి వచ్చి నమోదు చేసుకోవాలన్నారు. ఉదయం రక్తం ఇచ్చిన తరువాత అల్పాహారాన్ని ఆస్పత్రిలోనే అందిస్తామని చెప్పారు. అన్ని పరీక్షలు చేసి అదేరోజు మధ్యాహ్నానికి డాక్టర్ అపాయింట్‌మెంట్‌తో పాటు వెళ్లవచ్చన్నారు. మాస్టర్ హెల్త్ చెకప్‌లో రెండు ప్యాకేజీలు ఉన్నాయన్నారు. ఇందులో బేసిక్ రూ.4060, అడ్వాన్స్ రూ.9060 గా ఉంటుందన్నారు. మాస్టర్‌హెల్త్ చెకప్ కోసం ఇది సరైన సమయం అని ఒకేచోట అన్ని ఆరోగ్య పరీక్షలు, నిపుణుల వైద్య సలహాలు తీసుకోవచ్చన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కొరివారిపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని కొరివారిపల్లెలో ఆదివారం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళెం కమిటీ–2 సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షులు ధనుంజయ మాట్లాడుతూ, గ్రంథ పఠనంతో దైవజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో కులమతాలను రూపుమాపి, ప్రజల మధ్య నెలకొన్న అసమానతలను తొలగించడానికి భగవద్గీత పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు అర్జీలు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన సూచించారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ కుసుమకుమారి

ఐరాల: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఈఓపీఆర్డీ కుసుమకుమారి అన్నారు. మండలంలోని ఆదివారం 28 గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 252 హ్యాబిటేషన్స్, 42 మంది గ్రీన్‌అంబాసిడర్లతో రెండు రోజుల పాటు గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. ఇంటి నుంచి ప్రతి రోజు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. గ్రామ పంచాయతీలో చెత్త సంపద కేంద్రాలకు తరలించిన తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీ చేసి విక్రయించనున్నట్లు చెప్పారు. అలాగే పొడి చెత్తను విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. శని, ఆదివారం రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా నాలుగు ట్రాక్టర్లు, మూడు ఆటోలు, 25 ట్రైసైకిళ్లు ఉపయోగించి గ్రామాల్లోని చెత్త కుప్పలను, పేడదిబ్బలను ఊరికి దూరంగా తరలించినట్లు వివరించారు. ప్రజలు గ్రీన్‌అంబాసిడర్లకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

కేపీ శ్రీధర్ పుట్టినరోజు సంబరాలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్ పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత శ్రీధర్ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. అనంతరం తపోవనం, గంగనపల్లె సమీపంలోని నిరాశ్రయుల వసతి కేంద్రం, ఎంజీఆర్ వీధిలో అన్నదానం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కేక్‌కట్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, మహిళ నాయకులు, పార్టీ క్యాడర్ పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.





శ్రీధర్‌కు పార్టీ నేతల సత్కారం, అన్నదానం చేస్తున్న కేపీ శ్రీధర్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు – పూతలపట్టు :
95539 55610